క్లుప్తంగా

క్షయపై ప్రజలకు అవగాహన కల్పించాలి

బుచ్చినాయుడుకండ్రిగ: క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యాధికారిణి మాధవి ఆదేశించారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బందికి ఆమె సమావేశం నిర్వహించి మాట్లాడారు. క్షయ వ్యాధి ఉన్న వారికి దగ్గు, రాత్రుళ్ల జ్వరం రావటం, ఆకలి తగ్గి బరువు తగ్గుతారన్నారు. క్షయ బాధితులకు ప్రభుత్వం ఉచితంగా మందులు పంపిణీ చేస్తుందని, వారికి ఖర్చులకు నెలకు రూ. 500 చొప్పున ఆరు నెలలు ఇస్తోందన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సుబ్రమణ్యం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


అంత్యక్రియలకు ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న గున్నేరి కిషోర్‌రెడ్డి

ఏర్పేడు: మండలంలోని రాజుల కండ్రిగకు చెందిన మునికృష్ణం రాజు(45) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచనల మేరకు పార్టీ మండల కన్వీనర్ గున్నేరి కిషోర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చెంగల్ రాజు, వైఎస్సార్ సీపీ నాయకుడు రవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



చిన్నిరాజ్

వరదయ్యపాళెం: గొర్రెలు, మేకలు పెంపకందారుల ప్రాథమిక సొసైటీ మండల అధ్యక్షుడిగా శ్రీ వేంకటేశ్వర గ్రూపుకు చెందిన ఆంబాకం చిన్నిరాజ్‌ను ఎంపిక చేశారు. సోమవారం వరదయ్యపాళెంలోని పశువైద్యశాల ప్రాంగణంలో గొర్రెలు, మేకల పెంపకందారులు సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. చిన్నిరాజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా మనోహర్ నాయుడు, డైరెక్టర్లుగా తులసయ్య, లోకనాథం, వెంకటకృష్ణయ్య, ధనంజయులు, వెంకటలక్ష్మయ్యను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా నాగలాపురం మండలం ఎస్‌ఎస్ పురం పశువైద్యశాల వైద్యాధికారి ఏపీ ప్రదీప్ వ్యవహరించారు.

కల్వర్టుకు పిట్టగోడలు నిర్మించరూ!




గోడలేని కల్వర్టు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కంచన పుత్తూరు వద్ద కేటీ రోడ్డుకు ఉన్న అడవి నుంచి నీరు వచ్చే కాలువ కల్వర్టుకు ఇరువైపుల పిట్ట గోడలు లేకపోవడంతో వాహనాలకు ప్రమాదాలకు తావిచ్చేలా ఉంటోంది. కల్వర్టు గోడలు దెబ్బతిని పదేళ్లు కావస్తున్నా వాటిపై ఆర్‌అండ్‌బీ అధికారులు దృష్టి సారించడం లేదు. కల్వర్టు గోడలను నిర్మించాలని పలుమార్లు ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాహనదారులు మండిపడుతున్నారు. ఇకనైనా ఈ పనులకు పూనుకోవాలని పలువురు కోరుతున్నారు.

నడివీధిలో ట్రాన్స్‌ఫార్మర్!

- తరచూ ప్రమాదాలే



వరదయ్యపాళెం: స్థానిక గోపాలరావుకాలనీలో ట్రాన్స్‌కో అధికారులు నడివీధిలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదాలకు కారణమవుతోంది. అటు వెళ్లే పాదచారులు, పశువులు తరచూ విద్యుత్ షాక్‌కు గురవుతున్నట్లు స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అది కూడా చేతికందే ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చడం..ఆ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ సర్వీస్ వైర్లు వేలాడుతుండడంతో ప్రమాదాలకు కారణమవుతోంది. ఇకనైనా ట్రాన్స్‌కో అధికారులు దానిని మరోచోటుకి మార్చాలని కోరుతున్నారు.

మందుల వితరణ

తిరుపతి తుడా: వెంకటేశ్వర కిడ్నీ పేషెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీహరి మంగళవారం కిడ్నీ రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దాత చంద్రశేఖర్ సహకారంతో మందులు అందజేసినట్టు అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరామయ్య తెలిపారు.

సమష్టి కృషితో మళ్లీ అధికారం

- శిక్షణ సమావేశంలో ఎమ్మెల్యే ఆదిమూలం



శాస్త్రిరాజును సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం, నేతలు

కేవీబీపురం: గత ప్రభుత్వాలతో పోల్చితే మూడేళ్ల జగనన్న ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి, మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా సమష్టి కృషి చేయాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. మంగళవారం కేవీబీపురంలో పార్టీ మండల కన్వీనర్ గవర్ల కృష్ణయ్య అధ్యక్షతన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్యే దిశా నిర్దేశం చేశారు. వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు ఒక్కొక్కరికి 25 ఇళ్ల చొప్పున కేటాయించామని, తమ పరిధిలోని ఆ ఇళ్లను సందర్శించి, సమస్యలను తెలుసుకోవాలన్నారు. తర్వాత సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలన్నారు.

టీడీపీది నీతిమాలిన రాజకీయం

టీడీపీ ప్రభుత్వ పాలనలో జన్మభూమి కమిటీలు, నాయకులకు మినహా ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఎమ్మెల్యే విమర్శించారు. టీడీపీ ప్రభుత్వ పాలనలో కేవీబీపురం ఎంపీపీగా గిరిజన మహిళ ఉండటాన్ని జీర్ణించుకోలేక అవిశ్వాసం పెట్టేందుకు ఎంపీడీఓ కార్యాలయంలో బీరువాలు పగలగొట్టిన నీచ సంస్కృతి టీడీపీ నాయకులదని, ఇప్పుడు కూడా నీతిమాలిన రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు నారా లోకేష్ చేస్తున్న పాదయాత్రలో నిలదీయాలని ఆయన సూచించారు. అనంతరం ప్రభుత్వ పథకాల స్టిక్కర్లు, క్యాలెండర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మునెమ్మ, వైస్ ఎంపీపీ డేరాల శ్రీనివాసులు, మండల సచివాలయాల కన్వీనర్ల అధ్యక్షుడు శాస్త్రిరాజు, ఎంపీటీసీలు సుబ్బన్న, అయప్ప, సర్పంచ్‌లు నాయకులు హరిబాబు, ఢిల్లీ, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ మండల కన్వీనర్‌గా శాస్త్రిరాజు

కేవీబీపురం: సచివాలయాల కన్వీనర్లకు మండల అధ్యక్షుడిగా పూడి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత శాస్త్రిరాజును నియమించినట్లు ఎమ్మెల్యే ఆదిమూలం ప్రకటించారు. ప్రతి సచివాలయం పరిధిలో కన్వీనర్లతో పాటు పది మంది ఉత్సాహవంతులైన యువకుల్ని నియమించి పార్టీ పథకాలు, సంక్షేమాన్ని ప్రజల్లోకి విస్తృతం చేస్తామని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం శాస్త్రిరాజును ఎమ్మెల్యేతోపాటు పార్టీ నేతలు సన్మానించారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానని శాస్త్రిరాజు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి సమస్యనీ పరిష్కరిస్తాం



లబ్ధిదారులకు సంక్షేమ బుక్‌లెట్‌తో లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

కేవీబీపురం : తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యనీ పరిష్కరిస్తానని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హామీ ఇచ్చారు. మండలంలోని దిగువపుత్తూరులో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మాట్లాడారు. మూడేళ్ల పాలనలో వివిధ పథకాలతో గ్రామంలో దాదాపు 200 కుటుంబాలు పొందిన లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకం కుటుంబాలను ఆర్థికంగా బలపరుస్తుందని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

తాగునీరు, మురుగు కాలువలు, విద్యుత్ సమస్యలను ప్రజలు ఎమ్మెల్యేకు నివేదించారు. ఆయా సమస్యలను సంబంధిత అధికారులు పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. కొన్ని సమస్యల పరిష్కారానికి జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం దిగువ పుత్తూరు ఎస్టీ కాలనీలో జగనన్న కాలనీలో ఎమ్మెల్యే పర్యటించారు. ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. మౌలిక వసతుల కల్పనపై ఆరా తీశారు. నిర్మాణాలకు అవసరమైన సిమెంట్‌ను సకాలంలో లబ్ధిదారులకు ఇవ్వాలని హౌసింగ్ అధికారులకు సూచించారు, కార్యక్రమంలో సర్పంచ్ బాలాజీ, పార్టీ మండల కన్వీనర్ గవర్ల కృష్ణయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు మునెమ్మ, ఎంపీపీ మునిలక్ష్మి, వైస్ ఎంపీపీ డేరాల శ్రీనివాసులు, నాయకులు నందకుమార్, లాల్‌బాబుయాదవ్, వెంకటరత్నం, దశరథరామిరెడ్డి, ఎంపీటీసీలు మూర్తి సుబ్బన్న, మోహన్‌నాయుడు, ముదిరాజ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ధనుంజయరెడ్డి, తహసీల్దార్ ద్వారకనాథ్ రెడ్డి, ఎంపీడీఓ రామచంద్ర, ఎంఈఓ లక్ష్మీపతి, సర్పంచులు, వలంటీర్లు పాల్గొన్నారు.

స్ఫూర్తి పొందేలా జగనన్న పాలన



సంక్షేమ పథకాల లబ్ధి గురించి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): మన రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను చూసి పొరుగు రాష్ట్రాలు స్ఫూర్తి పొందేలా పాలన చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం మండలంలోని శివనాధపాళెం, శివనాధపురం, రామలింగాపురం ఎస్టీ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. వారికి అందుతున్న సంక్షేమ పథకాల ఫలాలపై ఆరా తీశారు. పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు అందరికీ తమ ప్రభుత్వం ఇస్తోందన్నారు. సమస్యలున్నపక్షంలో నేరుగా పార్టీ కార్యాలయంలో సైతం తెలియజేయవచ్చన్నారు. గ్రామంలో కొంత మందికి పింఛన్లు రద్దు చేశారని గ్రామస్తులు ఎమ్మెల్యేకు నివేదించారు. దీనిపై ఆయన స్పందించారు. సంబంధిత అధికారులు ఈ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ఉన్నం వాసుదేవ నాయుడు, చంద్రబాబునాయుడు, చెంచుకృష్ణమ నాయుడు, మోహన్‌కిషోర్ నాయుడు, సర్పంచ్ రాజ్‌ప్రకాష్, గిరి, దామోదరం, వైస్ ఎంపీపీ గెరటారెడ్డి, తహసీల్దార్ సుధీర్‌రెడ్డి, ఎంపీడీఓ తరుణాక్షి రెడ్డి, సీఐ విక్రమ్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు కాసారంలో గడప గడపకు..

తొట్టంబేడు మండలం కాసారం సచివాలయ పరిధిలోని కాసారం, దళితవాడలో బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహిస్తారని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ బియ్యపు పవిత్రారెడ్డి తెలిపారు.

శివరాత్రి పోస్టర్ల ఆవిష్కరణ

నారాయణవనం: మండలంలోని ప్రఖ్యాత పర్యాటక కేంద్రమైన కైలాసనాథకోనలోని కామాక్షాంబిక సమేత కైలాసనాథస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవ పోస్టర్లను మంగళవారం సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాలకవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆవిష్కరించారు. శివరాత్రికి కైలాసకోనకు వచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా అన్ని వసతులు కల్పించాలని, అన్నప్రసాదాలను అందజేయాలని, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ దివాకర్‌రెడ్డి, ఆలయ పాలక మండలి చైర్మన్ సుబ్రమణ్యంయాదవ్, ఈఓ కృష్ణనాయక్, సింగిల్‌విండో చైర్మన్ ఊరప్ప, వైస్ ఎంపీపీ శివకంకర్, సర్పంచ్‌లు ధర్మలింగం, మురళి, సచివాలయ మండల కన్వీనర్ కోనేటి బాబు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి: ఏర్పేడు మండలం గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల పురస్కరించుకుని వాల్ పోస్టర్లను మంగళవారం బియ్యపు పవిత్రారెడ్డి ఆవిష్కరించారు. మహాశివరాత్రి వేడుకల్లో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆలయ చైర్మన్ నరసింహయాదవ్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు రా..రమ్మని!



మంత్రి రోజాకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు తదితరులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 13 నుంచి నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రావాలంటూ పలువురు ప్రముఖులను ఆలయ పాలకమండలి, అధికారులు ఆహ్వానించారు. మంగళవారం శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో మంత్రి ఆర్‌కే రోజా, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, కలెక్టర్ వెంకటరమణారెడ్డిని కలిసి ఆహ్వాన పత్రికలు ఇచ్చారు. అలాగే ఆలయ అధికారులు మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసులు, అడ్వకేట్ జనరల్ శ్రీరామ్‌ను ఆహ్వానించారు. వారికి ముక్కంటి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు మల్లికార్జునప్రసాద్, సతీష్‌మాలిక్, పాలక మండలి సభ్యులు మహేందర్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, రమాప్రభ, సునీత, లక్ష్మి, ప్రత్యేక ఆహ్వానితులు చింతామణి పాండు, పాలమంగళం నీల, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

బాలుర ఉన్నత పాఠశాల తనిఖీ



మాట్లాడుతున్న డీవైఈఓ రఘురామయ్య

నారాయణవనం: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలను పుత్తూరు డీవైఈఓ రఘురామయ్య మంగళవారం తనిఖీ చేశారు. ప్యానల్ తనిఖీ బృందంతో ఆయన సాయంత్రం వరకు పలు రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల నైపుణ్యాలను పరీక్షించారు. అనంతరం టీచర్లతో సమీక్షించారు. పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలన్నారు. చదువులో వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆనంద బాబు, టీచర్లు పాల్గొన్నారు.

'ఉపాధి' రికార్డుల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న పార్వతమ్మ

ఏర్పేడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ మండల కార్యాలయంలో మంగళవారం డ్వామా ఫైనాన్స్ మేనేజర్(అకౌంట్స్), ఏపీఓ పార్వతమ్మ తనిఖీ చేశారు. కూలీల వేతనాల చెల్లింపులు, సమావేశాలు, ఎం–బుక్ రికార్డు, సిబ్బంది హాజరు తదితర రిజిస్టర్లను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ సీఆర్డీ డైరెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని మండలాల్లో తనిఖీలు చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సాంకేతిక సహాయకులు మనోహర్, పట్టాభిరెడ్డి, రవీంద్రుడు, కల్పన, కంప్యూటర్ ఆపరేటర్లు వినయ్‌తుల్లా, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదుకు ప్రత్యేక శిబిరం



ఆధార్ కేంద్రంలో వివరాలు నమోదు చేసుకుంటున్న జూనియర్ కళాశాల విద్యార్థులు

సత్యవేడు: సత్యవేడు పంచాయతీకి సంబంధించి ఆధార్ నమోదు కేంద్రాన్ని స్థానిక జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేశారు. మంగళవారం జూనియర్ కళాశాలలో 270 మంది విద్యార్థినీ విద్యార్థులలో 30 మంది ఆధార్ అప్‌డేట్ చేసుకున్నారని ప్రిన్సిపల్ బి.అనిల్ కుమార్ తెలిపారు. ఆధార్ కార్డు చిరునామా, ఫొటో నిక్షిప్తం, ఫోన్ నంబర్ నమోదు, తిరుపతి జిల్లాగా మార్పు, ఆధార్‌కు ఈమెయిల్ లింక్, బయోమెట్రిక్, పేరు మార్పు, డీఓబీ మార్పు, చిరునామా మార్పులు చేస్తున్నట్టు డిజిటల్ అసిస్టెంట్ కే. ప్రకాష్ తెలిపారు. కన్నావరంలోని ఆధార్ కేంద్రాన్ని ఎంపీడీఓ బాలగణేష్ పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ వాసు, డిజిటల్ అసిస్టెంట్ చంద్రమోహన్, వెల్ఫేర్ అసిస్టెంట్ రేణుక తదితరులు పాల్గొన్నారు.

మోటారుకు మరమ్మతులు

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురంలో సర్పంచ్ మంజుల ఆధ్వర్యంలో మంగళవారం తాగునీటి మోటారు మరమ్మతులు చేశారు. రెండు రోజుల క్రితం తాగునీటి సరఫరా విద్యుత్ మోటారు చెడిపోయింది. స్పందించిన సర్పంచ్ దీనిని రిపేరు చేయించి తాగునీటికి ఇబ్బందులు లేకుండా చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గురవారెడ్డి పాల్గొన్నారు.

ఎయిడ్స్, క్షయపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ తేజస్విని

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం స్టెప్స్ సంస్థ ఎయిడ్స్, క్షయ వ్యాధులపై ఆశావర్కర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించింది. సంస్థ మేనేజర్ రమేష్ మాట్లాడారు. 2017 ఎయిడ్స్ నియంత్రణ, నివారణ చట్ట ప్రకారం వ్యాధితో బాధపడే వారు, వారి కుటుంబ సభ్యుల పట్ల వివక్ష చూపరాదని, అలా చేస్తే వారికి జైలు శిక్ష, జరిమానా విధిస్తారని డాక్టర్ తేజస్విని తెలిపారు. కార్యక్రమం సూపర్‌వైజర్ కామరాజు, భాను ప్రకాష్, సంపూర్ణ, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, సంస్థ సిబ్బంది గాయత్రి, సురేష్, దేవేంద్ర, రోజా పాల్గొన్నారు.

వర్క్‌షాప్‌తో నైపుణ్యాలు పెంపు



విద్యార్థికి ప్రశంసా పత్రం, జ్ఞాపిక ఇస్తున్న ప్రిన్సిపల్ చంద్రశేఖర్‌రెడ్డి

నారాయణవనం: వర్క్‌షాప్ విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపునకు దోహదం చేస్తుందని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ అశోక్‌రాజ్ అన్నారు. బెంగళూరుకు చెందిన ఎస్‌ఎఫ్‌ఎక్స్ టెక్నాలజీ అకాడమీతో సంయుక్తంగా సిద్ధార్థ కళాశాలలో నిర్వహించిన రెండు వారాల వర్క్‌షాప్ మంగళవారం ముగిసింది. సైన్స్ అండ్ ఇంజినీరింగ్, సీఎస్‌ఎం, సీఐసీ, సీవీడీ, సీసీసీ, సీఎస్‌ఐటీ స్పెషలైజేషన్‌కు చెందిన ద్వితీయ సంవత్సరం విద్యార్థులు వర్క్‌షాప్‌కు హాజరయ్యారు. ప్రతిభ కనబరచిన వారికి కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన ముగింపు సమావేశంలో ప్రశంసా పత్రాలను చైర్మన్ డాక్టర్ అశోకరాజు అందజేసి ప్రసంగించారు. వృత్తి విద్యాకోర్సుల్లో నైపుణ్యత తోడైతే మంచి అవకాశాలను పొందవచ్చునని ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ గోపినాథ్, విభాగాధిపతులు గీతావాణి, రాజకుమార్, సమన్వయకర్తలు కుమార్, ఇందిరావతి, ట్రైనర్లు తేజగౌడ, మణికంఠ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం





పల్లంపేటలో మాట్లాడుతున్న పావనశ్రీ, కుక్కలగుంట స్కూలులో మాట్లాడుతున్న సుబోస్

ఏర్పేడు: బాల్య వివాహాలను నిర్మూలిద్దామని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పావనశ్రీ అన్నారు. వివాహాల నిర్మూలనపై ర్యాలీ, అవగాహన కార్యక్రమం మంగళవారం మండలంలోని పల్లంపేట అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించారు. పావనశ్రీ మాట్లాడారు.బాలికలు విద్యతో తమ జీవితాలను తీర్చిదిద్దుకోవాలన్నారు. పేదరికం, మూఢనమ్మకాలతో పిల్లలకు బాల్యవివాహాలు చేయరాదని, ఎవరైనా బాల్యవివాహాలు చేస్తే రూ.లక్ష జరిమానా విధిస్తారని చెప్పారు. అలాగే ఇదే అంశంపై ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో కుక్కలగుంట ప్రాథమిక పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణయ్య, ప్రగతి సంస్థ పాపానాయుడుపేట క్లస్టర్ కన్వీనర్ సుబోస్, అంగన్‌వాడీ కార్యకర్త రాజేశ్వరి, మహిళలు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం కోసం మహిళల ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మహిళలు

నారాయణవనం: సక్రమంగా రేషన్ బియ్యం ఇవ్వడం లేదని నిరసిస్తూ మంగళవారం స్థానిక చౌక దుకాణం నంబర్ 5 పరిధిలోని మహిళలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట హైవేపై ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ, మెయిన్‌రోడ్డు, రెడ్డివారి వీధి, కైనుకట్టు వీధుల్లో ఆరునెలలుగా రేషన్ బియ్యం ఇవ్వడం లేదని, దీనిపై వీధులకు వచ్చే వాహనం డ్రైవర్‌ను నిలదీస్తే షాపు నంబర్ 5 డీలర్ బియ్యం ఇవ్వడం లేదని చెబుతున్నాడన్నారు. గతంలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని, దీంతోపాటు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ఉచిత బియ్యాన్ని కూడా డీలర్ ఇవ్వడం లేదని, ప్రశ్నిస్తే పొంతనలేని సమాధానాలు డీలర్ చెబుతున్నారన్నారు. మహిళల ధర్నాపై తహసీల్దార్ ప్రమీల స్పందించారు. షాపు నంబర్ 5 డీలర్‌ను, వాహన డ్రైవర్‌ను పిలిపించి విచారణ చేశారు. రెండు రోజుల్లో షాపు పరిధిలోని కార్డుదారులందరికీ బియ్యం పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. మరోసారి ఇలాంటివి పునరావృతమైతే చర్యలు తప్పవని డీలర్‌ను తహసీల్దార్ హెచ్చరించారు.

నవ్విపోదురుగాక మాకేటి సిగ్గు!

- టీడీపీ నాయకుల అత్యుత్సాహం
- పార్టీ వారినే మళ్లీ చేర్చుకుని వైఎస్సార్ సీపీ నాయకులంటూ ప్రచారం



టీడీపీ నాయకులకే పార్టీ కండువాలు కప్పుతున్న జిల్లా నేతలు

కేవీబీపురం: మండలంలోని టీడీపీ నాయకులు మరోసారి అత్యుత్సాహం ప్రదర్శించి నవ్వులపాలయ్యారు. ఈ నెల 13, 14 తేదీలలో నారా లోకేష్ పాదయాత్ర కేవీబీపురానికి చేరనున్న నేపథ్యంలో ఆయనకు స్వాగతం, ఏర్పాట్లపై చర్చించేందుకు ఆ పార్టీ తిరుపతి తుడా మాజీ చైర్మన్ నరసింహయాదవ్ సమక్షంలో జిల్లా నాయకులు, మండల నాయకులు కార్యకర్తలు మంగళవారం సత్యవేడు టీడీపీ ఇన్‌చార్జ్ హేమలత అధ్యక్షతన కేవీబీపురంలో సమావేశమయ్యారు. కొందరు వైఎస్సార్ సీపీ నాయకులు టీడీపీలో చేరారంటూ కండువాలు కప్పి ప్రచారం చేశారు. వాస్తవానికి వీరంతా రాయపేడు గ్రామ టీడీపీకి చెందిన పాత నాయకులే కావడం గమనార్హం! పార్టీ వారికే కండువాలు కప్పి వైఎస్సార్ సీపీ నాయకులంటూ ప్రచారం చేయడంపై అందరూ ముక్కున వేలేసుకున్నారు. పైగా, పార్టీ చేరినవారంటూ పేర్కొన్న వారంతా టీడీపీలో 20 ఏళ్లుగా కొనసాగుతున్న వారేనని పరిశీలనలో తేలింది. అయితే పార్టీలో రెండు వర్గాల కారణంగా వారు కొన్ని రోజులుగా టీడీపీకి దూరంగా ఉన్నారు. మళ్ళీ వారిని బుజ్జగించి పార్టీ కండువాలు కప్పి, ఇలా బిల్డప్ ఇచ్చుకున్నారు.

తమ్ముళ్లపై నరసింహయాదవ్ ఫైర్

టీడీపీలో ఉంటూ జిల్లా, నియోజకవర్గ పరిశీలకులుగా వ్యవహరిస్తున్న నాయకులపై అసమ్మతి, వర్గ పోరు కారణంగా సత్యవేడుకు చెందిన కొందరు టీడీపీ కార్యకర్తలు సామాజిక మాధ్యమాల్లో పార్టీకి వ్యతిరేకంగా ట్రోల్స్ చేస్తున్నారని మండిపడ్డారు. అలాంటి వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రామాంజుల నాయుడు, మునస్వామియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్లతో వ్యవసాయం లాభసాటి



డ్రోన్ పిచికారీ విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

పిచ్చాటూరు: వ్యవసాయ రంగంలో డ్రోన్ల వాడకం వైపు మొగ్గు చూపితే రైతాంగానికి కూలీల ఖర్చులు, సమయం ఎంతో ఆదా అవుతుందని కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు అన్నారు. డ్రోన్‌తో పంటలకు పురుగు మందుల పిచికారీపై తులసి కృష్ణాపురంలో ప్రదర్శనపూర్వకంగా మండల వ్యవసాయ శాఖ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసింది. కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాసులు మాట్లాడుతూ, డ్రోన్‌తో ఎకరం పంటకు 6 నుంచి 8 నిమిషాలలో మందును పిచికారీ చేయవచ్చన్నారు. ఎకరాకు 10 లీటర్ల నీరు సరిపోతుందని, సాధారణ పద్ధతిలో వాడే పురుగు మందు 15 నుంచి 25 శాతం ఆదా అవుతుందని, అలాగే కూలీల ఖర్చు తగ్గి, సమయం ఆదా అవుతుందన్నారు. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మండల వ్యవసాయ అధికారి సంజీవ రెడ్డి మాట్లాడుతూ, పొద్దుతిరుగుడు పంటలో పొగాకు లద్దె పురుగు నివారణకు ఎమామెక్టిన్ బెంజోయేట్ లీటరు నీటికి 0.4 మి.లీ. చొప్పున పిచికారీ చేయాలన్నారు. అనంతరం రైతులకు పురుగు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు దివ్య, రామ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు రాఘమ్మ, వ్యవసాయ సహాయకులు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.